సాక్షి
నారాయణపేట

బుధవారం, 15, మే, 2024



'సైబర్' కేటుగాళ్లు
ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి.
వివరాలు 8లో ▸



ఆశాజనకంగా ఉల్లి ధర
మార్కెట్‌లో ఉల్లి ధర క్రమంగా పెరుగుతుండటం రైతుల్లో ఆశలు రేపుతున్నాయి.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.9 /23.7

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



దామరగిద్ద: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశాఖ జిల్లా అధికారి జాన్ సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని విఠలాపూర్, గడిమున్కన్‌పల్లి, దామరగిద్ద, బాపన్‌పల్లి గ్రామాల్లో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయా దుకాణాల్లో ఎరువులు, విత్తనాల స్టాక్ రికార్డులను పరిశీలించారు. వానాకాలం పంట సాగుకు సంబంధించి రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల విక్రయానికి సంబంధించి ఎప్పటికప్పుడు ఈపాస్ మిషన్‌లో నమోదు చేయాలన్నారు. ఫిజికల్ బ్యాలెన్స్, ఈపాస్ బ్యాలెన్స్‌ను సరిచూసుకోవాలని తెలిపారు. కాగా, రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే, స్థానిక స్థానిక వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పీయూకి ఈవీఎంలు, వీవీప్యాట్ల తరలింపు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈనెల 13న ఈవీఎంలలో ఓట్లు పోల్ కాగా, వాటిని పాలమూరు యూనివర్సిటీ (పీయూ) కి తరలించారు. మంగళవారం మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని కొడంగల్, నారాయణపేట, జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర, మక్తల్, షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లన్నింటినీ కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా సమక్షంలో ఇక్కడి ఎగ్జామినేషన్ బ్రాంచి, లైబ్రరీ బ్లాక్, ఇండోర్ గేమ్స్ కాంప్లెక్స్, ఇండోర్ స్టేడియం, ఫార్మస్యూటికల్ బ్లాక్‌లోని స్ట్రాంగ్‌రూం లలో భద్రపరిచారు. అనంతరం వాటికి ఎక్కడికక్కడ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జి.రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో సీల్ వేశారు. కాగా, ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూములతో పాటు చుట్టూ పూర్తిగా కేంద్ర బలగాలు, పోలీసులు కాపలా ఉన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావుతో పాటు ఆయా పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

నర్సింగ్ అసిస్టెంట్‌లో ఉచిత శిక్షణ

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ, హెచ్ఎస్‌బీసీ సంయుక్త ఆధ్వర్యంలో నర్సింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సరిత సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రథమ్ హెల్త్‌కేర్ శిక్షణ కేంద్రంలో 2 నెలల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ పూర్తి కాగానే ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. 18–30 ఏళ్లలోపు అభ్యర్థులు పదో తరగతితోపాటు ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, డిప్లొమా లేక ఇతర ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. శిక్షణలో స్టడీ మెటీరియల్, యూనిఫాం ఉచితంగా ఇవ్వడంతోపాటు ఉచిత వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు సెల్‌నం.9000203952 సంప్రదించాలని కోరారు.

'పోల్'మార్టం..!

లోక్‌సభ ఎన్నికల సరళిపై అభ్యర్థుల మల్లగుల్లాలు

- గత ఎన్నికలతో పోలిస్తే మహబూబ్‌నగర్‌లో 7.12 శాతం, నాగర్‌కర్నూల్‌లో 7.23 శాతం పెరిగిన ఓటింగ్
- ముఖ్య అనుచరులతో కలిసి బూత్‌ల వారీగా మంతనాలు
- క్రాస్ ఓటింగ్, సైలెంట్ ఓటింగ్‌పై క్షేత్రస్థాయిలో ఆరా
- గెలుపోటములపై ఎవరి లెక్కలు వారివే



సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభ ఎన్నికల పర్వం ముగియడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓట్ల శాతాన్ని బట్టి ఎన్నికల ఫలితాలను బేరీజు వేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ సరళిని పరిశీలించి తమకు వచ్చిన ఓట్ల శాతం ఎంత అనేది అంచనా వేసుకుంటున్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 72.43 శాతం ఓటింగ్ నమోదైంది. గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఈసారి 7.12 శాతం మేర ఓటింగ్ శాతం పెరిగింది. ఇది ఏ పార్టీకి నష్టం వాటిల్లనుంది, ఏ పార్టీకి ఎవరికి లాభం చేకూరనుంది అన్నది ఉత్కంఠ రేపుతోంది. ఓట్ల లెక్కింపు జూన్ 4న చేపట్టనుండటం, ఇందుకు దాదాపు మూడు వారాల సమయం ఉండడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది.

జడ్చర్లలో అత్యధికం.. మహబూబ్‌నగర్‌లో అత్యల్పం..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలింగ్ సరళిని పరిశీలిస్తే జడ్చర్ల నియోజకవర్గంలోనే అత్యధికంగా 77.92 శాతం పోలింగ్ నమోదైంది. ఆ తర్వాత షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 77.40 శాతం ఓటింగ్ జరిగింది. అత్యల్పంగా మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 66.27 శాతం పోలింగ్ నమోదైంది. ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం 16,82,470 మంది ఓటర్లలో 8,32,256 మంది పురుషులు, 8,50,172 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే 17,916 మంది ఎక్కువగా ఉన్నారు. అయితే ఎన్నికల్లో పురుషుల కన్నా మహిళల పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. 6,12,924 మంది పురుషులు ఓటు హక్కును వినియోగించుకోగా 73.65 శాతం పోలింగ్ నమోదైంది. అయితే 71.24 శాతంతో మహిళా ఓటర్లు 6,05,647 మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 2,44,525 మంది మహిళా ఓటర్లు ఎన్నికలకు దూరంగా ఉన్నారు.

గతానికి మించి భారీగా పెరిగిన ఓటింగ్..

గత లోక్‌సభ ఎన్నికల కంటే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. ప్రతిసారి అసెంబ్లీ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెరిగి, పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా తగ్గుతూ వస్తోంది. అయితే ఈసారి మాత్రం గత పార్లమెంట్ ఎన్నికల కంటే 7.12 శాతం అధికంగా పోలింగ్ నమోదైంది. 2004 లోక్‌సభ ఎన్నికల్లో 63.46 శాతం, 2009లో 67.68 శాతం, 2014లో 72.94 శాతం పోలింగ్ నమోదైంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 65.31 శాతం పోలింగ్ కాగా, తాజాగా 72.43 శాతం ఓటింగ్ నమోదైంది.

మహబూబ్‌నగర్ లోక్‌సభలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

అసెంబ్లీ స్థానం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	ఎన్నికల్లో (పోలింగ్‌శాతం) అసెంబ్లీ(2023)	పార్లమెంట్ (2024)
కొడంగల్	2,41,794	1,71,776	81.96%	71.04%
నారాయణపేట	2,36,182	1,63,284	78.36%	69.13%
మహబూబ్‌నగర్	2,59,260	1,71,815	70.56%	66.27%
జడ్చర్ల	2,22,838	1,73,634	81.57%	77.92%
దేవరకద్ర	2,39,745	1,78,602	82.73%	74.50%
మక్తల్	2,44,173	1,74,898	77.13%	71.63%
షాద్‌నగర్	2,38,478	1,84,578	81.20%	77.40%
మొత్తం	16,82,470	12,18,587	79.07%	72.43%

నాగర్‌కర్నూల్ లోక్‌సభలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు

అసెంబ్లీ స్థానం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	ఎన్నికల్లో (పోలింగ్‌శాతం) అసెంబ్లీ(2023)	పార్లమెంట్ (2024)
వనపర్తి	2,73,863	1,82,552	77.54%	66.66%
గద్వాల	2,56,637	1,92,300	82.42%	74.93%
అలంపూర్	2,40,063	1,77,780	76.16%	74.06%
నాగర్‌కర్నూల్	2,36,094	1,60,394	78.58%	67.94%
అచ్చంపేట	2,47,729	1,61,301	79.97%	65.11%
కల్వకుర్తి	2,44,405	1,77,226	83.23%	72.51%
కొల్లాపూర్	2,39,463	1,55,917	79.89%	65.11%
మొత్తం	17,38,254	12,07,471	80.95%	69.46%

నాగర్‌కర్నూల్ లోక్‌సభ పరిధిలో..

నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో మొత్తం 69.46 శాతం ఓటింగ్ నమోదైంది. **పార్లమెంట్** నియోజకవర్గ వ్యాప్తంగా **మొత్తం 17,38,254** ఓట్లకు గానూ సోమవారం **12,07,471** ఓట్లు పోలయ్యాయి. ఇందులో **6,13,085** మంది పురుషులు, 5,94,367 మంది **స్త్రీలు** కాగా, 19 మంది ఇతరులు ఉన్నారు. **గత లోక్‌సభ** ఎన్నికల్లో మొత్తం 62.23 శాతం పోలింగ్ నమోదు కాగా, ఈసారి ఎన్నికల్లో 7.23 శాతం ఓటింగ్ పెరిగింది. ఈసారి ఎన్నికలలో పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి అనుకూలంగా మారనుంది అన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

గద్వాలలో అత్యధికం, అచ్చంపేట, కొల్లాపూర్‌లో అత్యల్పం..

ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గద్వాల నియోజకవర్గంలో అత్యధికంగా 74.93 శాతం ఓటింగ్ నమోదైంది. ఆ తర్వాత అలంపూర్ నియోజకవర్గంలో 74.06 శాతం పోలింగ్ జరిగింది. నడిగడ్డ ప్రాంతంలోనే ఎక్కువ శాతం ఓటింగ్ జరగడం, ఈ ప్రాంతం ఏ పార్టీ వైపు తీర్పు ఇవ్వనుందన్నది ఆసక్తి రేపుతోంది. అలాగే అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల్లో అత్యల్పంగా 65.11 శాతం చొప్పున పోలింగ్ నమోదైంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కన్నా మహిళల ఓటింగ్ శాతం తక్కువగా నమోదైంది.

ఎవరి ధీమా వారిది

లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ఈవీఎం మిషన్లు, ఎన్నికల సామగ్రి జిల్లాకేంద్రంలోని స్ట్రాంగ్‌రూం వద్దకు చేరాయి. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బరిలో మొత్తం 19 మంది అభ్యర్థులు ఉండగా, ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా జరిగిన పోలింగ్ సరళిని బట్టి తమ గెలుపోటములను అంచనా వేసుకుంటున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా తమ పార్టీకి పడ్డ ఓట్లను లెక్కలు వేసుకుంటున్నారు. పార్టీల ముఖ్యనేతలు, శ్రేణులు, బూత్ ఇన్‌చార్జీలతో సమీక్షించి ఎన్నికల ఫలితాలను అంచనా వేసుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు.

క్రాస్ ఓటింగ్‌పైనే సర్వత్రా చర్చ..

మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గవ్యాప్తంగా ఎన్నికల్లో భారీఎత్తున క్రాస్ ఓటింగ్ జరిగిందనే చర్చ అంతటా విన్పిస్తోంది. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక పార్టీకి చెందిన నేతలు మరో జాతీయపార్టీకి అంతర్గతంగా మద్దతు ఇచ్చారన్న వాదన తెర మీదకు వస్తోంది. అర్బన్ ఓటింగ్ తమకు బాగా కలిసి వస్తోందని ఓ పార్టీ భావిస్తుండగా, పార్టీ శ్రేణులు, గ్రామీణ ఓటర్లు తమకే పట్టం కట్టారని మరో పార్టీ విశ్వాసంతో ఉంది.అయితే ఒక పార్టీకి చెందిన ఓటర్లు మరో పార్టీకి భారీ స్థాయిలో క్రాస్ అయ్యారనే విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పోలింగ్‌కు కొన్ని రోజుల ముందుగానే మారిన రాజకీయ సమీకరణాలు ఏ పార్టీకి లాభం, ఏ పార్టీకి నష్టం చేకూరనుందో అన్న దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

పర్యాటకం.. పట్టింపేది?



ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ విభాగంలో పర్యాటకులు (ఫైల్)

- జూరాల ప్రాజెక్టు వద్ద నీడ కరువు
- చంద్రగఢ్ కోటను గుర్తించేదెన్నడో..
- పర్యాటకులకు తప్పని అవస్థలు

అమరచింత: ఉమ్మడి జిల్లాకే తలమానికమైన ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ విభాగం ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోవడం లేదు. కృష్ణా పుష్కరాల సమయంలో ప్రాజెక్టు దిగువ భాగంలో నిర్మించిన పుష్కర ఘాట్‌లు నాణ్యత లేక వరద ప్రవాహానికి కొట్టుకుపోయి బండరాళ్లు తేలాయి. ప్రాజెక్టు సందర్శనకు వచ్చే పర్యాటకులు కాసేపు సేద తీరడానికి వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రాజెక్టు రహదారిలో అమరచింత మండలంలో ఉన్న చారిత్రక కట్టడం చంద్రగఢ్ కోటను సైతం పాలకులు విస్మరిస్తున్నారని మండల ప్రజలు అంటున్నారు.

కుడి కాల్వ వైపు ఆహ్లాదం..

జూరాల ప్రాజెక్టు కుడికాల్వ వైపు పరిసరాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలో కాల్వ ఉండటం, ప్రాజెక్టు ప్రధాన కార్యాలయాలు సైతం అటువైపే ఉండటంతో ఆ ప్రాంతంలో పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి చొరవతో అభివృద్ధి పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

ఎడారిని తలపిస్తున్న ఎడమ కాల్వ విభాగం..

ఎడమకాల్వ విభాగంలో ఆయకట్టుతో పాటు దిగువన విశాలమైన ప్రదేశం, ఇటువైపే రుచికరమైన చేప వంటకాలు లభిస్తుండటంతో సందర్శకులు అధికంగా ఇటువైపే వస్తుంటారు. చెట్ల నీడ సైతం లేకపోవడంతో ఎడారిని తలపిస్తుంది. పర్యాటకులు పిల్లాపాపలతో కాసేపు సరదాగా గడపడానికి వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు.

చారిత్రక చంద్రగఢ్ కోట..

గుప్తుల కాలంలో చంద్రగుప్తుడు తన రాజ్య విస్తరణతో పాటు పాలన, రక్షణ కోసం కృష్ణానది సమీపంలో తన భార్య చంద్రమతి పేరుతో కోట నిర్మించారు. శత్రువులను దూరం నుంచి పసిగట్టి మట్టుబెట్టేందుకు కోట పైభాగంలో ఫిరంగులు పేల్చడానికి వీలుగా కోట నిర్మాణం చేపట్టారు. ఆధ్యాత్మికత కోసం శివాలయం, రాతి కోనేరులు నిర్మించారు. ఈ కోనేరుల్లో మండు వేసవిలో సైతం నీరు ఉండటం విశేషం. ప్రస్తుతం నిర్వహణ కొరవడి కోటలోని పలు గోడలు, నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో అభివృద్ధికి నోచుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

వసతులు కల్పించాలి..

జూరాల ప్రాజెక్టు వద్ద వసతులు లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వసతులతో పాటు బోటింగ్ ఏర్పాటు చేయాలి.
– రాజు, మస్తీపురం

ప్రతిపాదనలు పంపాం..



జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వా విభాగంలో పార్కుల ఏర్పాటుకు గతంలో అధికారులకు నివేదికలు సమర్పించాం. వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించేందుకు మారోమారు ప్రతిపాదనలు పంపుతాం.
– జగన్మోహన్, ఈఈ, జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ విభాగం

బస్టాండ్లు కిటకిట



మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో హైదరాబాద్ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

- తిరుగు ప్రయాణంతో కిక్కిరిసిన ప్రయాణికులు
- హైదరాబాద్ రూట్లో బస్సులన్నీ ఫుల్
- సిటీలోని పలు డిపోల నుంచి 60 బస్సుల ద్వారా తరలింపు
- పరిశీలించిన ఆర్‌ఎం, ఇతర అధికారులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసిన ప్రజలు తిరుగు ప్రయాణంతో మంగళవారం ఆర్టీసీ బస్టాండ్లు కిటకిటలాడాయి. బస్టాండ్‌లోని ఏ స్టాప్ వద్ద చూసినా ప్రయాణికులు భారీ సంఖ్యలో కనిపించారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్లాట్‌ఫాంలన్నీ ప్రయాణికులతో సందడిగా మారాయి. తాండూరు, పరిగి, వనపర్తి, నారాయణపేట, మద్దూరు, మక్తల్, నాగర్‌కర్నూల్ తదితర రూట్లలో బస్సులు ప్రయాణికులతో నిండుగా వెళ్లాయి.

హైదరాబాద్ రూట్లో..

మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. సొంత గ్రామాల్లో ఓట్లు వేసిన చాలామంది ప్రజలు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో హైదరాబాద్‌కు వెళ్లే సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణికులు పోటీపడి ఎక్కారు. హైదరాబాద్ రూట్లో ట్రాఫిక్‌ను క్లియర్ చేయడానికి ప్రత్యేకంగా సిటీలోని పలు డిపోల నుంచి బస్సులను తెప్పించారు. రాజేంద్రనగర్, ఫలక్‌నుమా, ఫరూఖ్‌నగర్, మిథాని డిపోల నుంచి 60 బస్సుల ద్వారా మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్ రూట్లో నడిపారు. ఇతర ప్రధాన బస్టాండ్ల నుంచి కూడా హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల సంఖ్య అధికంగా కనిపించింది.

■ తిరుగు ప్రయాణంతో ఆర్టీసీ బస్టాండ్లలో రద్దీ దృష్ట్యా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆర్‌ఎం వి.శ్రీదేవి మహబూబ్‌నగర్ బస్టాండ్‌లోని పలు స్టాప్‌లను పరిశీలించారు. ఉద్యోగులకు సలహాలు, సూచనలు ఇస్తూ.. ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. ఆమె వెంట డిపో మేనేజర్ సుజాత, ఇతర అధికారులు ఉన్నారు.

బీజేపీ గెలుపును ప్రజలు నిర్ణయించారు



మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు: గత లోక్‌సభ ఎన్నికల కంటే ఈసారి జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో 10 శాతం ఓటింగ్ పెరిగిందని, మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో కూడా 10 శాతం పెరిగిందని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే అధికంగా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు పోలింగ్ బూత్‌కు వచ్చి ఓటు వేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించాలని ప్రజలు అధికంగా ఓటు వేస్తే.. ఈసారి మోదీని మరోసారి ప్రధానిని చేయడానికి గ్రామాల్లో పెద్ద ఎత్తున ఓటర్లు తరలివచ్చారన్నారు. ఎంపీ ఎన్నికల్లో డీకే అరుణ గెలవాలని ఎన్నికల కంటే ముందు ప్రజలు నిర్ణయానికి వచ్చిన పరిస్థితి చూశామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు 8 సార్లు వచ్చాడని, కాంగ్రెస్ వాళ్లు ఎంత బెదిరించిన ఆరు గ్యారంటీలు సక్రమంగా అమలు చేయలేదనే విషయం ప్రజలకు తెలుసన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం వంద శాతం గెలిచి తీరుతామని, 2–3 లక్షల మెజార్టీ వస్తుందన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి బీజేపీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకతీతంగా ఈ ఎన్నికల్లో బీజేపీ గెలవాలని మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. ప్రధాని మోదీ దేశ అభివృద్ధి కోసం పనిచేస్తే పాలమూరు పార్లమెంట్ అభివృద్ధి నేను కృషిచేస్తానని వెల్లడించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పద్మజారెడ్డి, రమేష్‌కుమార్, కిరణ్‌కుమార్‌రెడ్డి, పద్మవేణి, అంజయ్య, రామాంజనేయులు, కిషోర్, రాములు, బుద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరికీ కృతజ్ఞతలు: చల్లా



పిల్లలతో కలిసి ఆడుకుంటున్న వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ నియోజకవర్గంలో స్వచ్ఛందంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలందరికీ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా తమ అమూల్యమైన సమయాన్ని పాలమూరు ప్రాంతానికి కేటాయించి ప్రచార సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులతోపాటు గత కొన్ని నెలలుగా శక్తివంచన లేకుండా కాంగ్రెస్ పార్టీ విజయతీరాల వైపు నడిపించడానికి ఎత్తి జెండాను దించకుండా అహర్నిశలు కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ఎప్పటికప్పుడూ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించి పోలింగ్‌ను శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకున్న ఉన్నతాధికారులు, పోలీస్ యంత్రాంగానికి ఆయన అభినందనలు చెప్పారు.

■ గత నెల రోజుల నుంచి ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా పాల్గొన్న చల్లా వంశీచంద్‌రెడ్డి పోలింగ్ ముగిసిన అనంతరం మంగళవారం హైదరాబాద్‌లోని తాను ఉంటున్న అద్దె ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా పిల్లలు మహాక్షరెడ్డి, కృష్ణదేవారెడ్డితో కలిసి బొమ్మలతో ఆటలాడుకుంటూ సరదాగా ముచ్చటించారు.



పస్పులకు చేరిన కృష్ణమ్మ

కృష్ణానదిలో నీటిమట్టం తగ్గడంతో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ డ్యాం నుంచి నీటిని వదిలింది. మంగళవారం ఉదయం నీరు మండలంలోని పస్పుల ఘాట్‌కు చేరింది. అర్ధరాత్రి వరకు జూరాల జలాశయానికి చేరుకుంటుందని అధికారులు తెలిపారు. కృష్ణానదిలో ప్రవాహం కనిపిస్తుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
– మక్తల్

క్లుప్తంగా

బావిలో పడి వ్యక్తి మృతి


నేనావత్ స్వామి (ఫైల్)

పాన్‌గల్: బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వేణు వివరాల ప్రకారం.. మండలంలోని శాగాపూర్ తండాకు చెందిన నేనావత్ స్వామి(36) ఈనెల 13న తన వ్యవసాయ పొలానికి వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి రాత్రి అయిన ఇంటికి రాలేదు. పొలం దగ్గరే ఉండి ఉంటాడని కుటుంబ సభ్యులు భావించారు. మంగళవారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది పొలం దగ్గర, తెలిసిన వారి గృహాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. మధ్యాహ్నం వేళ తండాకు చెందిన ఇద్దరు యువకులు చేపలు పట్టడానికి వెళ్లారు. వాని పొలం సమీపంలో ఎరుకలి చిన్న నర్సింహ బావిలో మృతదేహం కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు సమాచారం ఇవ్వడంతో బావి దగ్గరికి వెళ్లి మృతదేహాన్ని నేనావత్ స్వామిగా గుర్తించారు. నీళ్లు తాగడానికి వెళ్లి బావిలో పడి మృతిచెందినట్లు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. స్వామికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి..


వ్యక్తి మృతదేహం

ధరూరు: మండల కేంద్రంలో కొంతకాలంగా భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. దాదాపు 50 ఏళ్ల వయసు గల వ్యక్తి రెండేళ్లుగా ధరూరు బైపాస్‌లో మతి స్థిమితం లేకుండా తిరుగుతూ.. హోటళ్ల వద్ద ఏదైనా ఆహారం పెడితే తింటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. ఎవరైనా గుర్తిస్తే సెల్ నం.87126 70293కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఆటో ఢీకొని బాలుడు..

కొత్తూర్: రోడ్డు దాటుతున్న బాలుడిని ఓ ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతిచెందిన సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. షాద్‌నగర్ మండలం హాజిపల్లికి చెందిన పద్మమ్మ, సందీప్‌కుమార్‌ల కుమారుడు అభిరామ్(7) వేసవి సెలవుల్లో అమ్మమ్మ గ్రామం కొత్తూర్ మండలం ఈజీపూర్‌కు వెళ్లాడు. ప్రధాన రోడ్డు పక్కనే ఇల్లు ఉండటంతో రోడ్డు దాటే క్రమంలో వేగంగా వస్తున్న ఆటో బాలుడిని ఢీకొట్టి అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. తల పగిలి తీవ్ర గాయాలైన బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆటోలోని ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన ఆటో హన్వాడ మండలం సల్లోనిపల్లెకు చెందినది కాగా.. అదే గ్రామానికి చెందిన ఓ కుటుంబం పోలేపల్లి ఎల్లమ్మ ఆలయానికి మొక్కులు చెల్లించేందుకు వస్తున్న క్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బాలుడి తండ్రి సందీప్ కుమార్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ తిరుపతయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వేసవి సెలవుల్లో అమ్మమ్మ ఊరికి వచ్చి బాలుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

చికిత్సపొందుతూ వృద్ధురాలు..

జడ్చర్ల టౌన్: జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో రైల్వేట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తు రైలు ప్రమాదానికి గురైన వృద్ధురాలు మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ప్రస్తుతం మృతదేహం జిల్లా ఆస్పత్రి మార్చురీలో ఉందని మున్సిపాలిటీ కౌన్సిలర్ ఎస్.రమేష్ తెలిపారు. వృద్ధురాలిని గుర్తిస్తే రైల్వే పోలీస్ 9441273164 నెంబరుకు ఫోన్‌చేసి సంప్రదించాలని ఆయన కోరారు.

పెళ్లి కాలేదని యువకుడు ఆత్మహత్య

రాజోళి: పెళ్లి కావడం లేదని మనస్తాపంతో ఓ యువకుడు పురుగు మందు తాగగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. రాజోళికి చెందిన ఉస్మాన్ బాషా (26) తన మామ మాబు దగ్గర ఉంటూ మగ్గం నేస్తుండేవాడు. కాగా.. ఎన్ని పెళ్లి సంబంధాలు చూసినా కుదరకపోవడంతో మనస్తాపానికి గురైన ఈ నెల 10న సెల్ఫీ వీడియో తీసుకుంటూ పురుగుమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు కిందపడి యువకుడు..

గద్వాల క్రైం: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ కథనం ప్రకారం.. గద్వాల పట్టణానికి చెందిన మహ్మద్ మౌలాలి(26) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే కొన్ని రోజులుగా మానసిక, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారి మంగళవారం సాయంత్రం పాతహౌసింగ్ కాలనీ సమీపంలోని గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై భార్య మహబూబ్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

‘సైబర్’ కేటుగాళ్లు!

ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణ పేరిట వ్యాపారులకు గాలం

‘వారం కిందట అచ్చంపేటలోని ఓ వ్యాపారికి ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేశాడు.. పర్వతాలు గారు.. నేను పుర కార్యాలయం నుంచి మాట్లాడుతున్న.. గుర్తు పట్టలేదా? శ్రీనివాసరావును.. మీ ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి.. గతేడాది కూడా కలిశా.. అప్పుడూ రెన్యూవల్ నాకే ఇచ్చారు. ఇప్పుడు సిస్టం వద్ద ఉన్నాను.. మీకో ఫోన్‌నంబర్ చెబుతాను.. దానికి రూ.9,800 ఫోన్‌పే చేస్తే వాట్సాప్‌లో రసీదు పంపిస్తా.. లేదంటే మీ దుకాణం సీజ్ చేస్తాం’ అంటూ నమ్మబలికాడు. దీంతో ఆయన డబ్బులు చెల్లించాడు. వాట్సాప్‌లో రసీదు రాకపోవడంతో తిరిగి ఫోన్ చేస్తే ఎంతకూ ఎత్తకపోవడంతో మోసపోయానని గుర్తించారు.’





అచ్చంపేట పుర కార్యాలయం

- అచ్చంపేటలో పలువురికి ఫోన్లు చేసిన వైనం
- రూ.లక్షల్లో వసూలు
- బయటకు చెప్పుకోలేని దుస్థితి

అచ్చంపేట రూరల్: ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇంటర్‌నెట్‌లో అడుగుపెట్టినా.. అనుమానిత ఫోన్ కాల్స్ లిఫ్ట్ చేసినా ప్రమాదం పొంచి ఉంటుంది. నేరుగా ఫోన్ చేసి ఫలానా వ్యక్తి మీరు.. ఓటర్ కార్డు, పాన్‌కార్డు, ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ అప్‌డేట్ చేయాలంటూ నమ్మబలికి ఓటీపీల ద్వారా ఖాతాలు ఖాళీ చేస్తున్న పరిస్థితి. అచ్చంపేట మున్సిపాలిటీ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌ల పునరుద్ధరణ పేరిట సరికొత్త మోసానికి తెరలేపారు సైబర్ నేరగాళ్లు.

జిల్లాలోని నాలుగు పురపాలికల్లో..

జిల్లాలోని నాగర్‌కర్నూల్‌లో 1,038, కల్వకుర్తిలో 698, అచ్చంపేటలో 515, కొల్లాపూర్‌లో 412 ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. సైబర్ నేరగాళ్లు వ్యాపారులను టార్గెట్ చేసుకొని ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యూవల్ చేసుకోవాలని.. లేదంటే దుకాణాలు సీజ్ చేస్తామంటూ భయపెట్టిస్తున్నారు. నమ్మిన కొందరు వ్యాపారులు డిజిటల్ విధానంలో రూ.5 వేల నుంచి రూ.10 వరకు చెల్లించి మోసపోయారు. మరికొందరు కార్యాలయానికి వచ్చి చెల్లిస్తామని బదులివ్వగా.. లేదు వెంటనే చెల్లించాలని, ఏప్రిల్ వరకే గడువు ఉందని, సైట్ క్లోజ్ అవుతుందంటూ, జరిమానాలు చెల్లించాల్సి వస్తుందంటూ చెప్పడంతో నిజమేనని భావించి డబ్బులు చెల్లించారు. ఈ విషయాన్ని కొందరు మున్సిపల్ అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా తమకేమీ సంబంధం లేదని.. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో బిజీగా ఉన్నామని చెప్పడంతో తాము మోసం పోయామని వ్యాపారులు తలలు పట్టుకుంటున్నారు. ఎవరికీ చెప్పుకోలేక.. మోసపోయామని పోలీస్‌స్టేషన్లలో కూడా ఫిర్యాదు చేయడం లేదు. ఇలాంటి కాల్స్ 15 రోజులుగా అచ్చంపేటలోని పలు దుకాణాదారులు, వ్యాపారస్తులకు వస్తున్నాయి.

అవగాహన లేకనే..

ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన ఉండాలి. అప్పుడే ఏదైనా సందర్భంలో మోసం జరుగుతుందని సులువుగా గుర్తించగలరు.. లేదంటే కేటుగాళ్లు మోసపూరిత కాల్స్‌తో అకౌంట్ హ్యాక్ చేసి ఖాతాలు ఖాళీచేసే ప్రయత్నాలు చేస్తారు. ఆయా శాఖల అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో అమాయకులు మోసపోతున్నారు.

కార్యాలయంలో చెల్లించాలి



అజ్ఞాత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌ను ఎవరూ నమ్మొద్దు. ట్రేడ్ లైసెన్సుల రెన్యూవల్ కోసం మీ–సేవా కేంద్రాల్లో లేదంటే నేరుగా మున్సిపల్ కార్యాలయంలో బకాయిలు చెల్లించి రసీదులు పొందాలి. పార్లమెంట్ ఎన్నికల కారణంగా సిబ్బంది కూడా బకాయిల వసూళ్లకు తిరగడం లేదు. ఏమైనా సందేహాలుంటే వెంటనే కార్యాలయంలో సంప్రదించాలి.

– శ్యాంసుందర్, పుర కమిషనర్, అచ్చంపేట

ఠాణా ఎదుట బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన


పోలీస్‌స్టేషన్ ఎదుట మున్సిపల్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకులను నిలువరిస్తున్న పోలీసులు

కౌన్సిలర్ ఇంటిపై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

అచ్చంపేట రూరల్: పుర బీఆర్‌ఎస్ కౌన్సిలర్ సుంకరి నిర్మల ఇంటిపై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం సాయంత్రం అచ్చంపేటలోని పోలీస్‌స్టేషన్ ఎదుట బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్ మాట్లాడుతూ.. దాడికి యత్నించిన కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కర్రలతో ఇంట్లో ఉన్న పలువురిపై దాడి చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలు అధికార దాహంతో దాడులకు పాల్పడుతున్నారని.. గాయపడిన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. కాగా సోమవారం జరిగిన పార్లమెంట్ పోలింగ్ సమయంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. కౌన్సిలర్ భర్త బాలరాజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి


మృతిచెందిన లేగదూడను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారి

కోయిల్‌కొండ: మండల పరిధిలోని నల్లవల్లి సమీపంలో రైతు రాఘవులుకు చెందిన లేగదూడపై చిరుత దాడి చేసిందని అటవీశాఖ అధికారి నరేందర్ తెలియజేశారు. సోమవారం రాత్రి రాఘవులు పశువుల కొట్టంలోని లేగదూడపై చిరుత దాడి చేసి, కొంత దూరం ఈడ్చుకెళ్లి ఆరగించింది. అడవుల్లో నీరు లేకపోవడంతో నీరు ఉన్న చోటుకు చిరుతలు సంచరిస్తున్నాయని చెప్పారు. ఈ సంఘటనపై మంగళవారం పంచానామా నిర్వహించామన్నారు. రైతుకు తగిన నష్టపరిహారం అందించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కూలీల ఆటో బోల్తా

- ఒకరు మృతి, ముగ్గురికి తీవ్రగాయాలు
- పది మందికి స్వల్ప గాయాలు


ప్రమాద స్థలంలో ఆటో, అక్కడే మృతురాలు వెంకటమ్మ



చారకొండ: పనులకు వెళ్లి తిరిగి వస్తున్న కూలీల ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఓ మహిళా కూలీ మృతిచెందగా.. 13 మందికి స్వల్ప గాయాలయ్యాయి. చారకొండ ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా డిండి మండలం రుద్రాయిగూడెంకు చెందిన 14 మంది కూలీలు, అదే గ్రామానికి చెందిన చందు ఆటోలో చారకొండ మండలం శాంతిగూడెంలో మిరపతోటలో మంగళవారం పనులకు వెళ్లారు. పని ముగించుకొని తిరుగు పయనమయ్యారు. మండలంలోని సిర్సనగండ్ల సమీపంలో రోడ్డుపై ప్రయాణిస్తున్న ఆటో మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. దాంతో ఆటోలో ప్రయాణిస్తున్న రుద్రాయి గూడెంకు చెందిన వెంకటమ్మ (54) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందింది. ఆటోలో ప్రయాణిస్తున్న 13 మందికి గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో తీవ్ర గాయాలైన ముగ్గురిని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన మిగతా 10 మంది చారకొండ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలియజేశారు. వెంకటమ్మకు భర్త కృష్ణయ్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యాపారి మృతి

- ఇంటి నిర్మాణానికి క్యూరింగ్ చేసిన తర్వాత సంఘటన
- కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి


నిర్మాణంలోని ఇల్లు


మహేష్‌గౌడ్(ఫైల్)

మక్తల్: విద్యుదాఘాతంతో వ్యాపారి మృతిచెందిన సంఘటన మక్తల్ పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ధరూర్ మండలం రేచింతలకి చెందిన మహేష్‌గౌడ్(38) పదిహేను ఏళ్ల కిందట మక్తల్‌కు వచ్చాయి. మక్తల్‌లో టీవీఎస్ షో రూం ఏర్పాటు చేసుకొని వాహనాలను విక్రయించి జీవనం సాగిస్తున్నాడు. మక్తల్‌లో ఉంటూ బాపూజీనగర్‌లో తన నూతన ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. నిర్మాణంలోని ఇంటి క్యూరింగ్ కోసం సోమవారం రాత్రి కరెంటు మోటార్ నుంచి నీటిని పట్టాడు. క్యూరింగ్ పూర్తయిన వెంటనే మోటార్‌ను బంద్ చేద్దామని వెళ్లే సమయంలో చేతికి కరెంట్ షాక్ తగిలి కిందపడ్డాడు. పక్కనే ఉన్న కొందరు వ్యక్తులు మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అంతలోపే మృతిచెందినట్లు వైద్యులు తెలియజేశారు. మహేష్ గౌడ్ మృతిచెందిన సమాచారం తెలియగానే కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై మృత్యుడి భార్య సంతోషి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లక్ష్మిరెడ్డి తెలియజేశారు. విద్యుదాఘాతంతో మృతిచెందిన మహేష్‌గౌడ్ కుటుంబ సభ్యులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అక్కడికి చేరుకొని పరామర్శించారు.

మద్యం దుకాణం నిర్వాహకుల దాడి

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మహబూబ్‌నగర్ క్రైం: వైన్స్ నిర్వాహకుల చేతుల్లో తీవ్రంగా గాయపడి.. ఆస్పత్రిలో దాదాపు 20రోజుల పాటు చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డాకుల మండలం బలిదుపల్లికి చెందిన శ్రీకాంత్(25) ఏప్రిల్ 25న స్నేహితులతో కలిసి మహబూబ్‌నగర్ పరిధిలోని అల్లీపూర్ రోడ్ మార్గంలో మద్యం తాగేందుకు వచ్చాడు. ఈ క్రమంలో బీర్ల కోసం బండమీదిపల్లి వద్ద ఉన్న మద్యం దుకాణం వద్దకు వెళ్లాడు. బీర్లు కావాలని శ్రీకాంత్ మద్యం దుకాణం నిర్వాహకులను అడిగాడు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆ తర్వాత మద్యం దుకాణం నిర్వాహకులతో పాటు బయటి నుంచి మరో పది మంది వచ్చి, శ్రీకాంత్ అతడి స్నేహితుడిని గదిలో బంధించి ఇద్దరిపై విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను కొత్తకోట, మహబూబ్‌నగర్ ఆస్పత్రుల్లో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లో మరో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మళ్లీ యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో జనరల్ ఆస్పత్రి ఎదుట కాసేపు ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత పోలీసులు సర్దిచెప్పారు. మృతుడి తల్లి వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మద్యం దుకాణం యాజమాని అరుణ్ కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్, బబ్లుతో పాటు మరికొందరిపై మర్డర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని రూరల్ సీఐ గాంధీ నాయక్ తెలియజేశారు. గొడవకు కారణాలు ఏంటో అనే అంశంపై విచారణలో తేలుతుందన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

రాజాపూర్: బతుకుదెరువు కోసం చైనా దేశానికి వలస వెళ్లి గుండెపోటుతో మృతిచెందిన వ్యక్తి మృతదేహం స్థానిక ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి చొరవతో 58 రోజుల తర్వాత స్వగ్రామానికి చేరుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మలేపల్లికి చెందిన సేవకుల జ్ఞానానంద్(58) చైనా దేశంలోని ఓ పరిశ్రమలో ఐదేళ్ల పాటు పనిచేసి తిరిగి స్వగ్రామానికి వచ్చి భార్యాపిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 22న తిరిగి చైనా దేశానికి విజిట్ వీసాపై మార్చి 17న గుండెపోటుతో మృతిచెందాడు. జ్ఞానానంద్ మృతిచెందాడన్న విష యం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మృతదేహం చైనా నుంచి తీసుకువడానికి ప్రయత్నించడంతో అక్కడి ప్రభుత్వం నిరాకరించింది. ఈ విష యం స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చొరవ చూపి మృతదేహాన్ని మంగళవారం గ్రామానికి తీసుకురాగా అంత్యక్రియలు నిర్వహించారు.


ఐదేళ్ల తర్వాత నేరం రుజువు

- నిందితుడికి పదేళ్ల జైలు.. రూ.10 వేల జరిమానా

నారాయణపేట రూరల్: ఘటన జరిగిన ఐదేళ్ల తర్వాత పోలీసులు నేరం రుజువు చేయడంతో ఓ వ్యక్తికి కోర్టు శిక్ష విధించింది. ఎస్పీ యోగేష్ గౌతమ్ కథనం మేరకు.. హైదరాబాద్‌లోని గౌతమ్‌నగర్ (ఫిల్మ్‌నగర్)లో ఉంటున్న మేకల హన్మంతు (35) 2019 ఫిబ్రవరి 26న నారాయణపేట మండలం లింగంపల్లి ఎల్లమ్మ జాతరకు వచ్చాడు. అదేరోజు రాత్రి సమీప బంధువు కాశీ ఇచ్చిన విందులో మిత్రులతో కలిసి పాల్గొన్నాడు. అక్కడే ఉన్న మర్ల శీనుకు గతంలో ఇచ్చిన డబ్బులు తిరిగి చెల్లించాలని హన్మంతు కోరాడు. వీరిద్దరి మధ్య మాటమాట పెరిగి హన్మంతు ఛాతీపై శీను బలంగా కొట్టాడు. రాత్రి ఇంటికి వెళ్లిన తర్వాత జరిగిన విషయం భార్య లక్ష్మికి చెప్పాడు. ఉదయం గుండె నొప్పి రావడంతో వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అదేరోజు బంజారాహిల్స్ ఠాణాలో భార్య ఫిర్యాదు చేయగా ఘటన నారాయణపేట పరిధిలో జరగడంతో కేసును బదిలీ చేశారు. అప్పటి ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకోగా సీఐ సంపత్‌కుమార్ దర్యాప్తు ప్రారంభించారు. చివరకు ఐదేళ్ల తర్వాత నేరం రుజువు కావడంతో శీనుకు పదేళ్ల కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ మంగళవారం జిల్లా కోర్టు న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ తీర్పునిచ్చారు. కేసు ఛేదనకు కృషి చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

ఆశాజనకంగా ఉల్లి ధర

- 10 రోజుల కిందట రూ.1,600.. ప్రస్తుతం రూ.2,500లకు చేరిన రేటు
- రానున్న రోజుల్లో మరింత ధర పెరిగే అవకాశం
- ఇళ్ల వద్దే ఉల్లిని నిల్వ చేసుకుంటున్న రైతులు
- జిల్లాలో 1,054 ఎకరాల్లో సాగు


పల్లెగడ్డలో ఇంటి వద్ద నిల్వచేసిన ఉల్లిగడ్డ

మరికల్: మార్కెట్లో ఉల్లి ధర క్రమంగా పెరుగుతుండటం రైతుల్లో ఆశలు రేపుతున్నాయి. వారం కిందటి వరకు ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో ఉల్లి రైతులు ఆందోళనకు గురయ్యారు. దేవరకద్ర మార్కెట్‌లో గిట్టుబాటు ధర రాకపోయినా చేసేదిలేక తక్కువ ధరకే విక్రయించారు. మరికొందరు విక్రయించకుండా తిరిగి వెళ్లారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉల్లికి ఆశించిన ధరలు వస్తుండటంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 10 రోజుల కిందట క్వింటా రూ.1,600 పలికిన ఉల్లి.. ప్రస్తుతం రూ.2,500 ధర పలుకుతోంది. రానున్న రోజుల్లో ఉల్లి ధర మరింత పెరిగే అవకాశం ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ఎకరాకు రూ. 30 వేల ఖర్చు..

జిల్లాలో 1,054 ఎకరాల్లో రైతులు ఉల్లి సాగు చేశారు. ఎకరా పొలంలో ఉల్లిసాగు చేసేందుకు రూ. 30 వేలు ఖర్చవుతుంది. పంట కోతకు వచ్చిన సమయంలో మార్కెట్‌లో ఆశించిన ధరలు రాకపోవడంతో నష్టాలను చవిచూశారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు రాకపోవడంతో కొందరు రైతులు ట్రాక్టర్లు, ఆటోలపై గ్రామాల్లోకి వెళ్లి 50 కేజీల ఉల్లి బస్తా రూ.800లకు అమ్ముకున్నారు.

నెలరోజుల కిందట ధర ఇలా..

దేవరకద్ర మార్కెట్‌లో నెల రోజుల కిందట క్వింటా ఉల్లి గరిష్ఠంగా రూ. 1,260, కనిష్ఠంగా రూ. 700 ధర వచ్చింది. వారం వ్యవధిలోనే మార్కెట్‌లో ఉల్లి ధరలు మళ్లీ ఊపందుకోవడంతో క్వింటా ఉల్లి ప్రస్తుతం రూ. 2,500లకు చేరింది. ప్రస్తుతం ఉల్లిని విక్రయించే రైతులు కొంతమేరకు లాభాలను ఆర్జిస్తున్నారు.

నెల రోజుల్లో ఉల్లి ధరలు ఇలా..

తేదీ	క్వింటా ధర
15-04-2024	రూ.1,250
20-04-2024	రూ.1,300
30-04-2024	రూ.1,450
02-05-2024	రూ.1,600
08-05-2024	రూ.2,000
14-05-2024	రూ.2,500

ఇంటింటికి తిరిగి అమ్ముకున్నాం..



రూ. 20 వేల పెట్టుబడి పెట్టి, అరెకరా పొలంలో ఉల్లిని సాగుచేశాను. గతనెల మార్కెట్‌లో ఉల్లికి సరైన ధర లేకపోవడంతో ఇంటింటికి తిరిగి అమ్ముకున్నాను. 50 కిలోల బస్తాను రూ. 800 అమ్మినా పెట్టుబడి కూడా రాలేదు. ఉల్లి సాగుచేసి నష్టాలను చవిచూశాను.

– వెంకటప్ప, రైతు, మరికల్

ఇంటి వద్దే నిల్వ చేశాను..



మార్కెట్‌లో ఉల్లికి మద్దతు ధర లేకపోవడంతో ఇంటి వద్దే నిల్వచేశాను. పది రోజుల కిందట 10 బస్తాల ఉల్లిని దేవరకద్ర మార్కెట్‌కు తీసుకెళ్తే.. ధర లేక మార్కెట్ బయట విక్రయించాను. ప్రస్తుతం ఉల్లి ధరలు పెరగడం వల్ల ఆశలు పుట్టుకొస్తున్నాయి. మిగిలిన ఉల్లిని మార్కెట్‌లో అమ్మాలని అనుకుంటున్నాను.

– శ్రీనివాసులు, రైతు, పల్లెగడ్డ

వివాహిత అదృశ్యం

ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన వివాహిత ఎడ్ల రజిత(38) అదృశ్యమైన ఘటనపై మంగళవారం కేసు నమోదైంది. ఏఎస్ఐ సుజ్ఞానం తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న రజిత ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగిరాకపోవడంతో బంధువులు, తెలిసిన వాళ్ల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలువలేదు. మహిళకు భర్త రామస్వామితో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.